డబుల్ ట్రబుల్ ఇంజిన్

మహారాష్ట్రలో కాంట్రాక్టర్ల సమ్మె!

- బిల్లులు చెల్లించని సర్కారు
- 27 నుంచి సమ్మెకు దిగనున్నట్టు
- 2 లక్షల మంది కాంట్రాక్టర్ల ప్రకటన

ముంబై, నవంబర్ 20: మహారాష్ట్రలో బీజేపీ-శివసేన (షిండే వర్గం) సర్కారుపై కాంట్రాక్టర్లు కన్నెర్ర చేశారు. పెండింగ్ బిల్లులపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారు పోరుబాట పట్టారు. ఈ నెల 26లోగా బిల్లులు చెల్లించకపోతే ఆ మరుసటి రోజు నుంచి పెండింగ్ పనులన్నీ నిలిపివేసి సమ్మెకు దిగుతామని షిండే సర్కారుకు అల్టిమేటం జారీచేశారు. రాష్ట్ర సర్కారు రెండు లక్షలకుపైగా కాంట్రాక్టర్లకు రూ.10 వేల కోట్ల బిల్లులు బకాయి పడింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని దీపావళికి ముందు మూడుసార్లు ప్రభుత్వానికి లేఖలు రాసినా ఒక్క పైసా కూడా ఇవ్వలేదని రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు మిలింద్ భోసలే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే 27 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఇదే జరిగితే గ్రామీణాభివృద్ధి, జల వనరులు, జల సంరక్షణ పనుల మీద ప్రభావం పడుతుంది. అభివృద్ధి పనుల చెల్లింపుల కోసం బడ్జెట్‌లో 50-65 శాతం నిధులు కేటాయించాలని కాంట్రాక్టర్స్, ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. టెండర్ల ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధుల జోక్యాన్ని నివారించాలని, కొందరు నిర్దిష్టమైన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించడాన్ని వెంటనే ఆపేయాలని కోరింది. రూ.15 లక్షలలోపు అభివృద్ధి పనులను నిరుద్యోగులైన సివిల్ ఇంజినీర్లు, చిన్న కాంట్రాక్టర్లకు లాటరీ పద్ధతిలో కేటాయించాలని డిమాండ్ చేసింది.

మహారాష్ట్రలో మరో ఘోరం

- బాలికపై పలుమార్లు లైంగికదాడి
- గుండు గీసి సిగరెట్లతో వాతలు

ముంబై, నవంబర్ 20: మహారాష్ట్రలో మరో దారుణం జరిగింది. 14 ఏండ్ల బాలికపై ఒకడు పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. తొలుత బాలికకు గుండుగీసిన అతడు ఆపై సిగరెట్ పీకలతో తలపై వాతలు పెట్టి పైశాచిక ఆనందం పొందాడు. ఈ దారుణ ఘటన మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని గణేశ్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత సెప్టెంబర్‌లో దక్షిణ ముంబైలోని ప్రభుత్వ హాస్టల్‌లో 18 ఏండ్ల యువతిపై లైంగికదాడి జరిపిన సెక్యూరిటీ గార్డ్.. ఆమెను గొంతునులిపి చంపేశాడు. ఆ ఘటన మరువక ముందే తాజా దారుణం వెలుగుచూసింది. దీంతో మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

మధ్యప్రదేశ్‌లో పట్టపగలే యువతి కిడ్నాప్

భోపాల్, నవంబర్ 20: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. పట్టపగలే ఓ యువతి అపహరణకు గురయ్యారు. ఈ ఘటన గ్వాలియర్‌లో చోటుచేసుకున్నది. ఓ యువతి తన బంధువులతో కలిసి గ్వాలియర్‌లో బస్సు దిగారు. ఈ సమయంలో బైక్‌పై ఒక వ్యక్తి సిద్ధంగా ఉండగా.. మరో వ్యక్తి సదరు యువతిని ఈడ్చుకెళ్లి బైక్‌పై కూర్చోబెట్టాడు. అనంతరం అక్కడి నుంచి ఉడాయించారు. ఈ సందర్భంగా ఆ యువతి కేకలు వేస్తున్నా ఎవరూ కాపాడలేకపోయారు. వెంటనే ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గాలింపు చేపడుతున్నారు. పోలీసులు స్పందిస్తూ సీసీటీవీ ఫుటేజీని పరిశీలించామని, నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

కర్ణాటక 'హస్త'వ్యస్తం!

కర్ణాటకలో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి నరిగ్గా ఆరు నెలలు. అనలు ఈ పాట్టికి ఎందుకు ఓటేశామా? అని రాష్ట్ర ప్రజలు అప్పుడే చింతిస్తున్నారు. అంతర్గత కుమ్ములాటలు, సీఎం సీటు లొల్లి అటుంచితే.. రాష్ట్రంలో తీవ్రమైన కరెంట్, నీటి సంక్షోభం నెలకొన్నది. సిద్ధరామయ్య సర్కార్‌పై అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎన్నికలప్పుడు ఊదరగొట్టిన ఐదు గ్యారెంటీల అమలులోనూ కాంగ్రెస్ మోసం చేసిందని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. 'అట్లుంటది కాంగ్రెస్ తోని..!' అనేలా ప్రస్తుతం కర్ణాటక ప్రజల పరిస్థితి ఉన్నదనే విశ్లేషణలు వస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లు

హస్తం పాలనలో రాష్ట్రం ఆగమాగం

- చుట్టుముట్టిన విద్యుత్తు, నీటి సంక్షోభం
- కరెంట్ కోసం రోడ్డెక్కిన అన్నదాతలు
- విపరీతంగా పెరిగిపోయిన అవినీతి
- ప్రజాసంక్షేమం గాలికొదిలేసిన ప్రభుత్వం
- ఐదు గ్యారెంటీల అమలులో ఘోర వైఫల్యం
- సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్ నేతల కొట్లాట



భస్మాసుర హస్తం

బెంగళూరు, నవంబర్ 20: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు అయింది కర్ణాటక ప్రజల పరిస్థితి. 40 శాతం కమీషన్ సర్కార్‌గా పేరుపొందిన బీజేపీని గద్దె దింపి, కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. ఆర్నెల్లు కాకుండానే రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వంలో పెద్దయెత్తున అవినీతి కంపు కొడుతున్నది. కాంట్రాక్టులు, అధికారుల బదిలీల్లో కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక సీఎం సీటు కోసం కొన సాగుతున్న నేతలు సిగపట్ల వ్యవహారం ఎలాగూ ఉండనే ఉన్నది. ఓవైపు కరెంట్ లేక తాగేందుకు నీరు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే.. తమకు ఇవేమీ పట్టవన్నట్టుగా హస్తం పార్టీ నేతల తీరు కనిపిస్తున్నది.

నెలకు 50 మంది రైతుల బలవన్మరణాలు

సాగు కోసం నాణ్యమైన కరెంట్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు రైతులను నిండా ముంచింది. సరిపడా విద్యుత్తు సరఫరా లేక, ఉన్న కరెంట్ కూడా పదేపదే కోతలతో వస్తుండటంతో అన్నదాతలు నానాకష్టాలు పడుతున్నారు. పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టాలు, అప్పుల బాధలు తట్టుకోలేక వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆర్నెల్లలో దాదాపు 300 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కోత లేకుండా సరిపడా విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో రైతులు పెద్ద యెత్తున ఆందోళనలు చేస్తున్నారు.

కాంగ్రెస్ 'కమీషన్‌రాజ్'

కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌కు 'కమీషన్‌రాజ్'గా పేరొచ్చింది. కాంట్రాక్టర్లు, బదిలీల్లో కమీషన్లు అడుగుతున్నారని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, మంత్రి ప్రియాంక ఖర్గేపై ఆరోపణలు వస్తున్నాయి. పెండింగ్ బిల్లులు విడుదలకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తమను 10-15 శాతం కమీషన్ అడుగుతున్నారంటూ బృహత్ బెంగళూర్ మహానగర పాలిక కాంట్రాక్టర్ల సంఘం గతంలో సంచలన ఆరోపణలు చేసింది. మంత్రి ప్రియాంక్ ఖర్గే పరిధిలోని కియోనిక్స్‌లో కమీషన్ల దందా ఆకాశాన్ని తాకింది. బిల్లుల క్లియరెన్స్ కోసం ఎండీ 10-12 శాతం లంచం డిమాండ్ చేస్తున్నారని కియోనిక్స్ పరిధిలో పనిచేసే చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా 'క్యాష్ ఫర్ పోస్టింగ్స్'(పోస్టింగ్, బదిలీలకు ముడుపులు)' స్కామ్ దుమారం రేపుతున్నది. అధికారుల పోస్టింగ్‌లు, బదిలీలకు సంబంధించి సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర భారీ యెత్తున వసూళ్లు చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఐదు గ్యారెంటీలకు గ్రహణం

కర్ణాటకలో గద్దెనెక్కేందుకు ఐదు గ్యారెంటీల పేరుతో మాయ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఆ హామీల అమలులో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయింది. ఇప్పటికీ ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అమలవుతున్న పరిస్థితి కనిపించడం లేదు. సర్కారు సవాలక్ష కొర్రీలతో పేదలకు చుక్కలు చూపిస్తున్నది. 200 యూనిట్ల వరకు ప్రతీ ఇంటికి ఉచిత విద్యుత్తు ఇస్తామన్న కాంగ్రెస్.. ఉచితం మాట అటుంచి ఎడాపెడా విద్యుత్తు కోతలు పెడుతున్నది. బియ్యం దొరకడం లేదంటూ 'అన్నభాగ్య' స్కీమ్ అమలులో చేతులేత్తేసింది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమంటూ ఆర్భాటంగా 'శక్తి' స్కీమ్‌ను ప్రారంభించి.. ఇప్పుడు ఆర్థిక భారం పేరుతో అనేక మార్గాల్లో సర్వీసులు రద్దు చేసింది. నిరుద్యోగ భృతికి సంబంధించిన 'యువ నిధి' అయితే అతీగతీ లేదు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడంతో నిరుద్యోగులు రోడ్లెక్కుతున్నారు.

సీఎం కుర్చీలాటతో నిత్యం అస్థిరత

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ నిరంతరం అస్థిరతగా కొనసాగుతున్నది. ఎప్పుడు ఎవరు తిరుగుబాటు చేస్తారో? ఎప్పుడు ప్రభుత్వం కూలిపోతుందా? అనేలా పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు ముందు, తర్వాత కూడా కాంగ్రెస్‌లో సీఎం సీటు లొల్లి కొనసాగుతూనే ఉన్నది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే, వారి వర్గాలు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి తేలుతున్నాయి. వీరితోపాటుగా సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి వంటి మరికొంత మంది నేతలు కూడా సీఎం రేసులోకి వస్తున్నారు.

త్వరలో ఆపరేషన్ 'హస్త'!

- చాలా మంది బీజేపీ ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు
- జనవరి తర్వాత వారి చేరిక ప్రక్రియపై ముందుకు వెళ్తాం
- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ్ సవది వ్యాఖ్యలు

బాగల్‌కోట్: కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ్ సవది సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో అసంతృప్తి ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, జనవరి 26 తర్వాత దీనిపై ముందుకు వెళ్తామన్నారు. 'ఆ తర్వాత ఎంత మంది శాసనసభ్యులు కాంగ్రెస్‌లో చేరుతారో మీరే చూడండి!' అని సవది మీడియాను ఉద్దేశించి అన్నారు. 'ఆపరేషన్ హస్త'పై లక్ష్మణ్ సవది మీడియాతో మాట్లాడుతూ చాలా మంది బీజేపీ నేతలు కాంటాక్టులో ఉన్నారని వ్యాఖ్యానించారు. వారి చేరిక ప్రక్రియ ఒకసారి పూర్తయిన తర్వాత, వారికి తగిన పోస్టులు ఇవ్వడంపై ఆలోచన చేస్తామని అన్నారు. బీజేపీ నుంచి వచ్చే వారెవరికీ అన్యాయం జరుగదని, ఇష్టపూర్వకంగా తమ పార్టీలో చేరేవారికి సాదరంగా స్వాగతం పలుకుతామన్నారు.

అమెరికా వీసా.. మరింత వేగంగా

న్యూఢిల్లీ: వివిధ నగరాల్లో కొత్త కాన్సులేట్ కార్యాలయాల ఏర్పాటుతో అమెరికా వీసా దరఖాస్తుల పరిశీలన మరింత వేగవంతం కానున్నదని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గ్రాసెట్టీ అన్నారు. వీసా ప్రక్రియకు సంబంధించి వెయిటింగ్ టైమ్, బ్యాక్‌లాగ్‌ల సంఖ్య మరింత తగ్గుముఖం పడుతుందన్నారు. ఎరిక్ గ్రాసెట్టీ సోమవారం న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ, 'హైదరాబాద్ కాన్సులేట్ కార్యాలయంలో సిబ్బందిని పెంచాం. బెంగళూరు, అహ్మదాబాద్‌లో కొత్త కాన్సులేట్స్ త్వరలో అందుబాటులోకి వస్తాయి. ఇదంతా వీసా బ్యాక్‌లాగ్ సంఖ్యను తగ్గించేందుకు దోహదపడుతుంది' అని అన్నారు.

బ్రిటన్‌లో బిడ్డకు జన్మనిచ్చిన 'స్వలింగ' జంట

న్యూఢిల్లీ: వినూత్నమైన సంతాన సాఫల్య చికిత్సా విధానాన్ని పాటించిన ఓ స్వలింగ సంపర్కుల జంట పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. 'ఇన్వోసెల్' అనే వైద్య చికిత్సా విధానంలో బ్రిటన్‌కు చెందిన లెస్బియన్ జంట ఎస్టేఫానియా(30), అజారా(27) గత నెలలో మగ పిల్లాడికి జన్మనిచ్చారని, అండం ఫలదీకరణ ఎస్టేఫానియాలో జరుపగా, దాన్ని అజారా 9 నెలలపాటు మోశారని స్థానిక పత్రిక 'మెట్రో' వార్తా కథనం పేర్కొన్నది. సహజంగా గర్భం దాల్చడానికి 'ఇన్వోసెల్' పద్ధతికి పెద్దగా తేడా లేదని పేర్కొన్నది.

విస్కీ@22 కోట్లు

న్యూఢిల్లీ: ఇటీవల లండన్‌లో జరిగిన సౌత్‌బే సంస్థ వేలంలో ఒక స్కాచ్ విస్కీ సీసా 2.2 మిలియన్ పౌండ్ల(రూ.22 కోట్లు) రికార్డు ధరకు అమ్ముడుపోయి చరిత్ర సృష్టించింది. ఒక సీసా వైన్ లేదా ఇతర స్పిరిట్ల అమ్మకాల్లో వేలంలో అత్యధిక ధర పలికిన అమ్మకంగా ఇది కొత్త రికార్డు సృష్టించింది. మెక్‌కెల్లన్ అడమి 1926 బ్రాండ్‌కు చెందిన ప్రపంచంలోనే అతి విలువైన ఈ విస్కీని కొనడానికి కొనుగోలుదారులు పోటీపడ్డారు. ఈ అరుదైన విస్కీని 1986లో కేవలం 40 సీసాలు మాత్రమే ఉత్పత్తి చేశారు. ఇదే పీపాలో నిల్వ చేసిన మరో సీసా విస్కీ 2019లో 1.5 మిలియన్ పౌండ్లకు అమ్ముడుపోయింది.

మూడేండ్లు ఏం చేశారు?

బిల్లులను ఆమోదించకుండా ఎందుకు తొక్కి పెట్టారు?

బిల్లులను అటు తిరస్కరించలేదు.. ఇటు రాష్ట్రపతికి పంపలేదు..
విషయం కోర్టులకెక్కేవరకూ ఎందుకు వేచిచూశారు?
తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని నిలదీసిన సుప్రీంకోర్టు
కేరళ గవర్నర్ తీరుపై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ



న్యూఢిల్లీ, నవంబర్ 20: రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి మూడేండ్లు ఏం చేశారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఎందుకు పెండింగ్‌లో పెట్టారని నిలదీసింది. సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిన తరువాతనే గవర్నర్ స్పందించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 2020 జనవరిలో ఆమోదించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అంటే సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చిన తరువాతనే గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని, ఈ మూడేండ్లు ఆయన ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించేంత వరకు గవర్నర్ ఎందుకు వేచి చూడాల్సి వచ్చిందని నిలదీసింది. గవర్నర్ రవి నవంబర్ 2021లో బాధ్యతలు చేపట్టారని, అంతకుముందు నుంచే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై సీజేఐ చంద్రచూడ్ స్పందిస్తూ.. 'ఏ గవర్నర్ వల్ల బిల్లులు పెండింగ్‌లో పడ్డాయన్నది కాదు ప్రశ్న. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద లభించిన అధికారాలను వినియోగించడంలో గవర్నర్లు ఎందుకు జాప్యం చేశారన్నదే ప్రశ్న' అని వ్యాఖ్యానించారు. బిల్లులను అటు వెనక్కి తిప్పి పంపకుండా లేదా ఇటు రాష్ట్రపతికి పంపకుండా తన వద్దనే తొక్కి పెట్టవచ్చా? అని నిలదీశారు.

వేచిచూద్దాం..

గవర్నర్ తిప్పి పంపిన 10 బిల్లులను తమిళనాడు అసెంబ్లీ ఈ నెల 18న ఎటువంటి మార్పులు చేయకుండానే మళ్లీ ఆమోదించి పునఃపరిశీలనకు గవర్నర్‌కు పంపిందని తమిళనాడు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ బిల్లులపై గవర్నర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దామని ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు డిసెంబర్ ఒకటో తేదీకి వాయిదా వేసింది. ఆర్టికల్ 200 ప్రకారం రాష్ట్ర అసెంబ్లీ ఏదైనా బిల్లును సవరణలు చేసి లేదా చేయకుండా రెండోసారి ఆమోదించి గవర్నర్‌కు పంపితే.. తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుంది. ప్రజలు చట్టబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వానికి రాష్ట్ర గవర్నర్ ఓ రాజకీయ ప్రత్యర్థి లాగా అడ్డు పడుతున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ నెల 10 కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేస్తూ.. గవర్నర్ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది.

కేరళ గవర్నర్ తీరుపై కేంద్రానికి తాఖీదులు

శాసనసభ ఆమోదించిన బిల్లులకు తన సమ్మతిని తెలియజేయకుండా గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ పెండింగ్‌లో పెట్టారని ఆరోపిస్తూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి, కేరళ గవర్నర్ కార్యాలయానికి నోటీసులు జారీచేసింది. గవర్నర్ వద్ద ఎనిమిది బిల్లులు ఏడు నుంచి 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని కేరళ ప్రభుత్వం తరపు న్యాయవాది కేకే వేణుగోపాల్ తెలిపారు. గవర్నర్ తీరు ప్రజల హక్కులకు విఘాతం కలిగించేదిగా ఉన్నదని పేర్కొన్నారు.

గుజరాత్ జడ్జీల బదిలీకి నో!

హైకోర్టు న్యాయమూర్తుల బదిలీకి ఆమోదం తెలుపని కేంద్ర ప్రభుత్వం

బీజేపీ సర్కార్‌పై సుప్రీం ఆగ్రహం • ఈ వైఖరి సరికాదని హితవు
'పిక్ అండ్ చూజ్' మంచిది కాదు • ఏం సంకేతం ఇస్తున్నారు?
కేంద్రంపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం

న్యూఢిల్లీ, నవంబర్ 20: పలు హైకోర్టుల న్యాయమూర్తులకు బదిలీలకు సంబంధించి కొలీజియం చేసిన సిఫార్సుల్లో కేంద్ర ప్రభుత్వం కొన్ని పేర్లకు ఆమోదం తెలుపకపోవడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. మోదీ సర్కార్ జడ్జీల బదిలీకి ఆమోదం తెలుపని పేర్లలో గుజరాత్ హైకోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులు ఉండటం ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఈ విషయంలో సుప్రీంకోర్టు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుపై సోమవారం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల బదిలీలకు సంబంధించిన కొలీజియం సిఫారసు చేసిన పేర్లపై కేంద్రం అనుసరిస్తున్న 'పిక్ అండ్ చూజ్' విధానం సరికాదని, ఆమోదనీయం కాదని, ఇది మంచి సంకేతం పంపదని జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ సుధాంశు ధులాయ్ కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విధమైన విభజన విధానానికి వెంటనే స్వస్తి పలకాలని సూచించింది. పలు హైకోర్టుల్లోని 11 మంది న్యాయమూర్తులను బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేయగా.. అందులో ఐదు పేర్లకు మాత్రమే ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం, మరో ఆరుగురి పేర్లను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. బదిలీలు పెండింగ్‌లో ఉన్న న్యాయమూర్తుల్లో గుజరాత్ హైకోర్టు జడ్జీలు నలుగురు, అలహాబాద్, ఢిల్లీ హైకోర్టుల నుంచి ఒక్కరు చొప్పున ఉన్నారు. 'గుజరాత్ హైకోర్టు నుంచి నలుగురు జడ్జీల బదిలీకి కూడా ఆమోదం తెలుపలేదు. దీని ద్వారా మీరు ఏం సంకేతం పంపాలనుకొంటున్నారు?' అని ధర్మాసనం అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణిని ప్రశ్నించింది. 'చూడండి, ఒక దశలో ఏం జరుగుతుందంటే.. ఆయా కోర్టుల నుంచి మేం బదిలీ చేయాలనుకొనే న్యాయమూర్తులను మీరు అక్కడనే పని చేయించలేరు. ఇది సరికాదు. దీని పర్యవసానాలను మీరు అర్థం చేసుకోవాలి. అదే జరిగితే న్యాయమూర్తులు ఇబ్బంది పడుతారు, అధికారం పలుచన అవుతుంది. దయచేసి అలా జరుగకుండా చూడండి' అని కేంద్రానికి హితవు పలికింది.

గతంలోనూ ఇలాగే..

ఇటీవల హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం సిఫారసు చేసిన వాటిలో ఎనిమిది మంది పేర్లను కేంద్రం క్లియర్ చేయలేదని, వీరిలో కొంతమంది ఇప్పటికే నియామకం పొందిన వారి కంటే సీనియర్లు కూడా ఉన్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీంతో పాటుగా కొలీజియం పలు మార్లు సిఫారసు చేసిన మరో ఐదు పేర్లకు కూడా కేంద్రం స్పందన తెలపకపోవడాన్ని గుర్తుచేసింది. ఇంకా, జూలైలో పంపిన మూడు పేర్లకు సంబంధించి కొలీజియంకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇన్‌పుట్స్ రాలేదని, టైమ్‌లైన్ గడువు ముగిసినందుకు వీటిని ప్రస్తావిస్తున్నానని జస్టిస్ కౌల్ పేర్కొన్నారు. ఈ విధమైన 'పిక్ అండ్ చూజ్' విధానంపై గతంలో కూడా ఇదేవిధంగా అభ్యంతరం వ్యక్తం చేశామని, ఇది ఎంతమాత్రం ఆమోదనీయం కాదని సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యుడిగా కూడా ఉన్న జస్టిస్ కౌల్ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి స్పష్టం చేశారు.

ఒక్కసారి మీరు చూస్కోండి

కొలీజియం సిఫార్సులను ఆమోదించడంలో కేంద్రం జాప్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. కొలీజియం సిఫార్సుల ఆమోదం విషయంలో 2021లో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పెట్టిన కాలపరిమితిని ఉల్లంఘిస్తున్న కేంద్రంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆఫ్ బెంగళూరు ఓ పిటిషన్ వేసింది. న్యాయమూర్తుల బదిలీల విషయంలో ఎంపిక విధానం అనుసరించొద్దని జస్టిస్ కౌల్ ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ నొక్కిచెప్పారు. 'మీరు అనుసరిస్తున్న విధానాన్ని ఒక్కసారి చూడండి. దీని ద్వారా మీరు ఏ విధమైన సంకేతం పంపుతున్నారు?' అని ప్రశ్నించారు. నియామకాల్లో 'సెలక్టివ్' విధానం వల్ల సమస్య ఏర్పడుతుందని, కొంత మంది జడ్జీలు తమ సీనియారిటీ కోల్పోతారని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 5కు వాయిదా వేసింది. సిఫార్సులకు ఆమోదం తెలుపడంలో కేంద్రం చేస్తున్న ఆలస్యంపై ఈ ఏడాది సెప్టెంబర్‌లోనూ సుప్రీంకోర్టు తన అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 2022, నవంబర్ 11 నుంచి హైకోర్టు కొలీజియాలు చేసిన దాదాపు 70 సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నది.

తల్లిదండ్రుల ఒత్తిళ్ల వల్లే విద్యార్థుల ఆత్మహత్యలు

సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: విపరీతమైన పోటీ, తల్లిదండ్రుల ఒత్తిళ్ల వల్లే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారని సుప్రీంకోర్టు సోమవారం చెప్పింది. ఇలాంటి పరిస్థితుల్లో కోచింగ్ సెంటర్ల నియంత్రణకు ఆదేశాలు ఇవ్వలేమని తెలిపింది. కోచింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఉండకూడదని చాలా మంది అనుకున్నప్పటికీ, పాఠశాలల పరిస్థితిని చూడాలని తెలిపింది. పోటీ విపరీతంగా ఉన్నందువల్ల మరో దారి లేక కోచింగ్ సంస్థలకు వెళ్తున్నారని వ్యాఖ్యానించింది. ముంబై డాక్టర్ అనిరుద్ధ నారాయణ్ మల్పని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

'హైవేలు ఉన్నది చక్కర్లు కొట్టడానికి కాదు'

న్యూఢిల్లీ : హైవేలపై నడిచే పాదచారుల భద్రతకు భరోసా ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. హైవేలు ఉన్నది జనం యథేచ్ఛగా తిరగడానికి కాదని తెలిపింది. పిటిషనర్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, దీనిపై పిటిషనర్ కోరినట్లుగా ఆదేశాలను ఇవ్వలేమని హైకోర్టు చెప్పింది. పిటిషనర్లు ఈ అంశాలపై కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖను సంప్రదించవచ్చునని చెప్తూ, పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఆల్ట్‌మన్ వెంటే మేమూ

రాజీనామాకు సిద్ధమైన 500 మంది 'ఓపెన్ ఏఐ' ఉద్యోగులు

న్యూఢిల్లీ: 'చాట్‌జీపీటీ'తో సంచలనం సృష్టించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ కంపెనీ 'ఓపెన్‌ఏఐ' ఊహించని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. కంపెనీ సహ వ్యవస్థాపకుల్లో ఒకరు, సీఈవో సామ్ ఆల్ట్‌మన్‌పై 'ఓపెన్‌ఏఐ' బోర్డు వేటు వేయటం ఆ కంపెనీ ఉద్యోగుల్ని ఆగ్రహానికి గురిచేసింది. ఆల్ట్‌మన్ తొలగింపుపై నిరసన వ్యక్తం చేస్తూ.. మొత్తం 500మంది ఉద్యోగులు రాజీనామాకు సిద్ధమయ